సాక్షి
పెద్దపల్లి
గురువారం ♦ 2 ♦ మార్చి ♦ 2023



సిలిండర్ ధర మళ్లీ పెంపు

ఓవైపు కరోనాతో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కాగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. 8లో▸



రామగుండం నియోజకవర్గానికి రండి

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గానికి రావాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. హుజూరాబాద్‌లో పర్యటిస్తున్న రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసి సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం

రోజంతా సాధారణ ఉష్ణోగ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా రేణుకాఎల్లమ్మ పట్నాలు



అబ్బాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ పట్నాలు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో కుర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేణుకాల్లమ్మ కల్యాణోత్సవంలో భాగంగా, పట్నాలు, బోనాలు, కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం స్థానిక బీరన్న ఆలయం వద్ద బోనాలు తీసుకువచ్చి, పట్నాలపై పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మ–మునిరాజు కల్యాణోత్సవం నిర్వహించి ఎల్లమ్మ జీవిత కథను ఒగ్గు పూజారుల భక్తులకు వినిపించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కచ్చు బీరయ్య,శంకర్, ఒగ్గు పూజారులు కచ్చు శ్యాం, ఘట్టయ్య, బృందం పాల్గొన్నారు.

‘అడ్రస్ లేని డబుల్ బెడ్‌రూం ఇళ్లు’



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్వప్న

ఓదెల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు అడ్రస్ లేదని బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్న తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇంతవరకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మండలంలో పేదలకు ఎన్ని ఇళ్లు కేటాయించారు..? ఎంత బడ్జెట్ మంజూరు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే సాకుతో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాత్తూరి అనిల్, మండల మహిళా కన్వీనర్ మేకల శోభ, నాయకులు మహేశ్, ప్రశాంత్, రజిత, అనూష పాల్గొన్నారు.


బీసీ జనగణనకు జాప్యమెందుకు..?



దీక్ష శిబిరంలో పాల్గొన్న రమేశ్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ జనగణనకు ఎందుకు జాప్యం చేస్తున్నాయో స్పష్టం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బి.రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 35 రోజులుగా కొనసాగుతున్న రిలేదీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్‌ను 52 శాతానికి పెంచాలన్నారు. ఐదు శాతం కూడా లేని అగ్రవర్ణాల వారే అధికారం చలాయిస్తూ బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. నాయకులు రాజు, వెంకటేశ్, కాంపల్లి బాబు, శారద, రవికుమార్, శ్రీధర్, రాజయ్య, సతీశ్, నరేశ్ తదితరులున్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమం



హాజరైన భక్తులు, ఆర్జీ–2 జీఎం మనోహర్

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తృతీయ పుష్కరోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీత్రిదండి దేవనాథ జీయర్‌స్వామి పర్యవేక్షణలో సుదర్శన హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. 85 కలశాలతో అభిషేకం, మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ సతీమణి కళ్యాణి, ఏరియా జీఎం ఎ.మనోహర్, సేవా అధ్యక్షురాలు సవితా, ఆర్జీ–3 జీఎం సతీమణి శ్రీదేవి, సేఫ్టీ జీఎం సతీమణి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. అప్పులు తీరక..!

ఈజీఎస్ పథకం కింద చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, క్రీడా ప్రాంగాణాలు, రైతు వేదికలు.. ఇలా పల్లెల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా పూర్తి స్థాయిలో బిల్లులు రావడం లేదని, అప్పుల పాలవుతున్నామని కలెక్టర్‌కు బుధవారం గోడు వెళ్లబోసుకున్నారు సుల్తానాబాద్ మండలం నారాయణారావుపల్లి సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మీ. ప్రభుత్వ ఒత్తిడితో ముందుగా నిధులు రాకపోయినా.. సర్పంచ్‌లు వాటిని పూర్తిచేశామని, 15వ ఆర్థిక సంఘం నిదులు సిబ్బంది జీతాలకు సరిపోక.. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులతో ఇబ్బంది పడుతున్నామని వినతిపత్రం ఇచ్చారు.



- అభివృద్ధి పనులకు నిధుల గండం
- అప్పులతో సర్పంచ్‌ల సతమతం
- ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యం
- బిల్లులు రాక ఘొల్లుమంటున్న సర్పంచులు
- ఇబ్బందుల్లో పంచాయతీ పాలకవర్గాలు..

సాక్షి, పెద్దపల్లి: గ్రామాలే అభివృద్ధికి పట్టుగొమ్మలు.. ఇందుకోసం సర్పంచులు, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషిచేయాలి. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు వస్తే.. ప్రగతి పనులు చకచకా సాగుతాయి. జిల్లాలో ఈ తరహా వాతావరణం కనిపించడం లేదు. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం వివిధ చోట్ల తెచ్చిన అప్పులు తిరిగి చెల్లించేందుకు సర్పంచులు ముప్పుతిప్పలు పడుతున్నారు. పనుల అనంతరం చెక్కుల క్లియరెన్స్ కాక తలలు పట్టుకుంటున్నారు. పల్లెప్రగతిలో భాగంగా పంచాయతీల్లో వైకుంఠధామం, కంపోస్టు షెడ్ల నిర్మాణంతోపాటు సీసీ రోడ్లు, భవనాల తదితర పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లుల చెల్లింపులలో తీవ్ర జాప్యం నెలకొంది. పనులు చేపట్టిన సర్పంచులు అప్పులు పాలుకావాల్సి వస్తోంది.

రాష్ట్ర నిధులు రాక..

కేంద్ర ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీలకు నేరుగా నిధులు మంజూరు చేయాలనే ఉద్దేశంతో జీరో అకౌంట్ తెరిపించింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా సర్పంచ్, ఉప సర్పంచులకు కలిపి డిజిటల్ కీ ఇచ్చింది. 15వ ఆర్థికసంఘం నిధులను డిసెంబర్‌లో విడుదల చేసింది. వాటికి సంబంధించిన పనుల బిల్లులు వెంటనే క్లియర్ అవుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు విడుదలయ్యాయి. అప్పటి నుంచి 6 నెలలు దాటుతున్నా ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో సర్పంచుల్లో ఆందోళనకు దారితీస్తోంది.

నెలకు రూ.లక్ష వరకు ఖర్చు

అభివృద్ధి పనులకు తోడు పంచాయతీల నిర్వహణ మొత్తం సర్పంచులే చూసుకుంటున్నారు. ట్రాక్టర్లకు డీజిల్, వీధిదీపాలు, బోరుమోటార్ల మరమ్మతు, కార్మికుల జీతభత్యాలు వారే చూసుకుంటున్నారు. చెక్కులు మంజూరైన తర్వాత తీసుకోవచ్చనే ధీమాతో అప్పు తెచ్చి పనులు ఆగకుండా నడిపిస్తున్నారు. ఒక్కొక్కరు నెలకు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో మెజార్టీ సర్పంచులు అధికార పార్టీలోనే కొనసాగుతున్నారు. బిల్లులు రావడం లేదని చెప్పినా అంతగా ప్రయోజనం లేకపోగా.. ఎమ్మెల్యేకు కోపం వస్తుందని బయటకు చెప్పుకోవడం లేదు. మరోవైపు పనుల కోసం తెచ్చిన అప్పుల వడ్డీలు భరించలేక మదనపడుతున్నారు.

అప్పు తెచ్చి అభివృద్ధి చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులకు ఫ్రీజింగ్ పెట్టడంతో ఆర్నెళ్లుగా అప్పు తెచ్చి డీజిల్, శాని టేషన్ పనులు చేయిస్తున్నాం. ఇప్పటివరకు ఒక్కపైసా కూడా రాలే. తెచ్చిన అప్పులకు వడ్డీ పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫ్రీజింగ్ ఎత్తివేసి నిధులు విడుదల చేయాలి.

– కవ్వంపల్లి జమున, సర్పంచ్, భూపతిపూర్

చిన్న పల్లెల్లో నిర్వహణ భారం

జిల్లాలో 266 గ్రామ పంచాయితీలున్నాయి. ఇందులో 62 కొత్త పంచాయతీలుగా ఆవిర్భవించాయి. వీటికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులే ఆధారం. పన్నులు ఎక్కువగా వసూలు కావు. వీటితోనే మెయింటెనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోంది. పల్లెప్రగతిలో భాగంగా బ్యాంకు నుంచి రుణం తీసుకుని ట్రాక్టరు, ట్యాంకర్ కొనుగోలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు వీటి కిస్తీలకే సరిపోతున్నాయి. మరోవైపు విద్యుత్ బిల్లుల చెల్లింపులు పంచాయతీలకే అప్పగించారు. హరితనిధి కింద పదిశాతం నిధులు మొక్కలు నాటడం, సంరక్షణకు కేటాయిస్తున్నారు. ఇవన్నీ చిన్న పంచాయతీలకు గుదిబండలా మారాయి. నిధుల విషయమై డీపీవో చంద్రమౌళిని వివరణ కోరగా ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే జీపీల్లో జమ చేస్తామన్నారు.

బిల్లు కోసం సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఎంపీఓ లంచం అడుగుతున్నాడని ఆవేదన
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట అఘాయిత్యం
- ఆసుపత్రికి తరలించిన సిబ్బంది
- పరిస్థితి మెరుగ్గా ఉందన్న వైద్యులు



చికిత్స పొందుతున్న సర్పంచ్ రవీందర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామంలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లు చెల్లించాలని కోరినందుకు ఎంపీఓ లంచం డిమాండ్ చేస్తున్నాడని పేర్కొంటూ అధికార పార్టీ సర్పంచ్ క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన సుల్తానాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. బాధిత సర్పంచ్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట సర్పంచ్ అన్నాడి రవీందర్‌రెడ్డి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశాడు. సుమారు రూ.25లక్షల పనులు చేయగా.. ఆయనకు రూ.16 లక్షల వరకు బిల్లు రావాల్సి ఉంది. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల కింద విడుదలైన రూ.2లక్షలతో సీసీ రోడ్లు కూడా పూర్తి చేశాడు. ఎంబీ రికార్డులు కూడా పూర్తి చేయించాడు. వీటన్నిటికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. బుధవారం కూడా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాడు. తనకు బిల్లు చెల్లించాలంటే ఎంపీవో ఫయాజ్ అలీ లంచం డిమాండ్ చేస్తున్నాడని, ఇప్పటికే అప్పులపాలైన తాను లంచం ఎక్కడి నుంచి తెచ్చేదని చెప్పినా వినిపించుకోవడం లేదని, ఈ–పంచాయతీలో అప్‌డేట్ చేయాలంటే లంచం తప్పదంటున్నాడని పేర్కొంటూ.. వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కార్యాలయం సిబ్బంది వెంటనే అతడిని సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. లంచం విషయమై ఎంపీఓ ఫయాజ్ అలీని వివరణ కోరగా.. పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేశామని, అప్‌డేట్ చేసిన తరువాత 48గంటల్లో బిల్లులు జమ అవుతున్నాయని తెలిపాడు. తాను లంచం అడిగినట్లు చెప్పడంలో వాస్తవం లేదన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ వైపు ఆర్ఎఫ్‌సీఎల్



అధికారులతో చర్చిస్తున్న సీఐఐ అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాలుష్యాన్ని నివారించేందుకు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) అధికారులు బుధవారం సమావేశమయ్యారు. ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంయుక్తంగా గ్రీన్‌హైడ్రోజన్ వినియోగంతో పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యం నుంచి విముక్తి కలిగించేందుకు ముందడుగు పడినట్లయ్యింది. ఈ రెండు సంస్థల్లో త్వరలోనే అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం ఎస్‌కే.ఝూ, ఎన్టీపీసీ అధికారులు సునీల్ కుమార్, సీఐఐ అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీని సందర్శించిన ఆర్ఈడీ



ఆర్ఈడీని సన్మానిస్తున్న బాబర్ సలీం పాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్లాంట్‌ను సంస్థ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబాశిస్ ఛటోపాధ్యాయ బుధవారం సందర్శించారు. యూనిట్ల పనితీరు, విద్యుత్ ఉత్పాదన, ఉత్పత్తిపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. రక్షణ చర్యలను పాటిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.

ఆర్ఈడీకి సన్మానం

ఆర్ఈడీని ఐఎన్టీయూసీ సీనియర్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ (ఉద్యోగ గుర్తింపు సంఘం) నాయకులు బుధవారం సన్మానించారు. ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, అడిషనల్ జనరల్ సెక్రటరీ కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మార్పుతోనే మనుగడ సాధ్యం



కొవ్వత్తులతో నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: మనిషిలో మార్పు రావాలని, అప్పుడే మనుగడ సాధ్యమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మెడికో విద్యార్థి ప్రీతి మృతికి సంతాపంగా బుధవారం రాత్రి మంథనిలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు బీఆర్ఎస్ పార్టీ మహిళ విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మాట్లాడారు. మెడికో విద్యార్థి ప్రీతి మరణం బాధాకరమన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మనిషి మారకపోవడం శోచనీయమన్నారు. మానవత్వం మరిచిన మనుషులు మృగాళ్లుగా మారి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డను సోదరిగా భావించే ఆలోచన చేయాలని, అప్పుడు ఇలాంటి సంఘటనలు జరగవన్నారు.

జిల్లాలో 3,394 డబుల్ బెడ్‌రూం ఇళ్లు



పెద్దపల్లిరూరల్: జిల్లాలో 3,394 డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఉన్నాయని, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఐడీసీ, టీఎస్ ఈడబ్ల్యూ ద్వారా పనులు చేపట్టామని, ఇంకా 1428 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని కలెక్టర్ సంగీత తెలిపారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనుల పురోగతి, లబ్ధిదారుల ఎంపికపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. పనులు పూర్తికాకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ఇళ్లలో వసతులు నాణ్యతగా చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించామని, పెండింగ్ ఉంటే వివరాలు ఇవ్వాలన్నారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ వెంకటమాధవరావు, వీరబ్రహ్మచారి, పంచాయతీ రాజ్ ఈఈ మునిరాజ్, ఆర్అండ్‌బీ ఈఈ నర్సింహాచారి, తహసీల్దార్లు, వెరిఫికేషన్‌టీం సభ్యులు తదితరులున్నారు.

యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

ధర్మారం: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్ సూచించారు. మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాలపై పోరాడాలన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రప్రభుత్వం అక్రమ మార్గంలో రాష్ట్ర ఖజానాను సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి పల్లెలో మద్యం ఏరులై పారుతోందన్నారు. బెల్టు షాపుల్లేని పల్లె ఎక్కడా లేదన్నారు. మద్యం కారణంగా హత్యలు, లైంగిక దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య, సర్పంచు గుజ్జుల రమాదేవి, వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కాదాసి శంకరమ్మ, మల్లేశం, సింగిల్ విండో మాజీ చైర్మన్ తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు సందనవేని లక్ష్మణ్, తీగుళ్ల సతీశ్‌రెడ్డి ఉన్నారు.

ల్యాండ్, సాండ్.. వైన్స్, మైన్స్‌లే..
బీఆర్ఎస్‌కు ఆదాయ మార్గాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుకక్వారీలు
- బినామీ పేర్లతో వందల కోట్ల వ్యాపారం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, హాజరైన జనం, పాదయాత్రలో ప్రజలకు అభివాదం తెలుపుతూ..



ఇల్లందకుంట: బీఆర్ఎస్ ముఖ్య నాయకులైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాఫియాగా ఏర్పడి స్యాండ్, ల్యాండ్, మైన్స్, వైన్స్‌లను ఆదాయ వనరులుగా మార్చుకుని వందల కోట్లు కొల్లగొడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల మానేరు ఇసుక క్వారీని పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, బల్మూరి వెంకట్‌లతో కలిసి వచ్చారు. ఇసుక దోపిడీని బాహ్యప్రపంచానికి తెలియపర్చడానికి నిజనిర్ధారణ కమిటీ ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇసుక మాఫియాతో కేసీఆర్ కుటుంబానికి భాగస్వామ్యం ఉంది కాబట్టే.. యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శించారు. ఈ మాఫియాకు కేసీఆర్ కుటుంబానికి చెందిన జోగినపల్లి సంతోష్, ఆయన తండ్రి రవీందర్‌రావుకు భాగస్వామ్యం ఉందన్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలకు విరుద్ధంగా.. పర్యావరణానికి హాని కలిగించేలా భవిష్యత్ తరాలకు ఇసుక కనుమరుగయ్యేలా తోడేస్తున్నారని, బినామీల పేరిట వందల కోట్ల వ్యాపారం చేస్తూ ఆస్తులు పెంచుకుంటూ ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు.

ఇసుక మాఫియాను అడ్డుకుంటే కేసులా..?

ఇసుక మాఫియాను అడ్డుకుంటే సిరిసిల్లలో పట్టిన గతే పడుతుందని పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, గతంలో తనుగులకు చెందిన ఒక రిద్దరు రైతులపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించడం దారుణమని, మాఫియాకు పోలీసులు ప్రైవేట్ సైన్యంగా పనిచేస్తున్నారని, పర్మిషన్ పేరిట ఒకే నంబర్‌పై పలు వాహనాలు నడుస్తున్నాయన్నారు.

సంజయ్, ఈటల ఎటు పోయారు..

ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సొంత ఇలాఖాలో ఇసుక దోపిడీ జరుగుతుంటే ఎక్కడికి పోయాడని రేవంత్ ప్రశ్నించారు. ఇక్కడకు రాకముందు ఈటలపై ఎంతో గౌరవం ఉండేదని.. పరిస్థితి చూశాక ఉన్న గౌరవం పోయిందన్నారు. మానేరు వాగు నుంచి నిత్యం రాత్రి పగలు పర్మిషన్ ఉన్న దానికంటే ఎక్కువగా వందల లారీలను వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుంటే ఎంపీ సంజయ్, ఈటల మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వాహనాల ఓవర్‌లోడ్‌తో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతుంటే ఎందుకు ఫిర్యాదు చేయడంలేదని మండిపడ్డారు. తనుగుల నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న జమ్మికుంటకు రెండు గంటల సమయం పడుతోందన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇసుకను తీయాలని.. యంత్రాలతో కాకుండా కూలీలతో తీయాలని.. కానీ అలా జరగడంలేదని అన్నారు. అధికారులను అడుగుదామంటే ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఎంపీగా, పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న తనకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు ఎక్కడ అని ప్రశ్నించారు.

కేసీఆర్ కుర్చీ కదులుతుందనే దాడులు..

కాంగ్రెస్ పార్టీకి పాదయాత్ర కొత్త కాదని.. పాదయాత్ర వల్ల కేసీఆర్ కుర్చీ కదులుతుందనే కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ పార్టీ దాడులు చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఎలాంటి దాడులకు తాము భయపడేదిలేదని, భవిష్యత్‌లో కూడా పాదయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. అక్రమ క్వారీలను మూయించే కాంగ్రెస్ పక్షాన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అంతకు ముందు అపరభద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే బిజిగిరిషరీఫ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వావిలాలలోని ఖాదీని సందర్శించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ రేవంత్ మాట్లాడారు. కార్యక్రమంలో మక్కాన్ సింగ్, నాయిని రాజేందర్‌రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, ఇంగిలి రామారావు, పూదరి రేణుకశివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల వేతనాలను సవరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు రామానుజం ఆరోపించారు. రాష్ట్ర సాధనలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. ఇప్పటికీ వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా మెరుగ్గా అందించేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్న తమను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ స్పందించి వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, జీవన వ్యయం పై ప్రభావం పడుతున్నందున వేతన సవరణ చేపట్టాలని ఎస్‌ఈ సుదర్శన్ పేర్కొన్నారు. నాయకులు ప్రభాకర్, రవీందర్, రాజ్‌కుమార్, కరుణాకర్, తిరుపతి తదితరులున్నారు.

ఆమె నేత్రాలు సజీవం



వరలక్ష్మి (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన చొల్లంగి వరలక్ష్మి(60) రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యులు ఆమె నేత్రాలు దానం చేయాలని నిర్ణయించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందించడంతో బుధవారం టెక్నీషియన్ ఆరిఫ్ సహాయంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు పంపించారు. వరలక్ష్మి కుటుంబసభ్యులను ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి తదితరులు అభినందించారు.

14వ డివిజన్ లక్ష్మీపురంలో..



మధునమ్మ నేత్రాలు సేకరించిన ప్రతినిధులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేముల మధునమ్మ(75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలు దానం చేయాలని భావించి, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు బుధవారం టెక్నీషియన్ ద్వారా మధునమ్మ నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి తదితరులు మృతురాలి కుటుంబసభ్యులను అభినందించారు.

కాట్నపల్లిలో గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని కాట్నపల్లికి చెందిన ఆకుల రంగస్వామిగౌడ్ అనే గీత కార్మికుడు బుధవారం తాటి చెట్టు పైనుంచి జారిపడి, తీవ్రంగా గాయపడినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం పోచ మల్లుగౌడ్ తెలిపారు. తోటి కార్మికులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారన్నారు. వైద్యుల సూచనల మేరకు కుటుంసభ్యులు మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

సిలిండర్ ధర మళ్లీ పెంపు

- వంటగ్యాస్‌పై రూ.50, కమర్షియల్‌పై రూ.350 అదనం
- ఉమ్మడి జిల్లా వినియోగదారులపై రూ.2.50 కోట్ల భారం



కరీంనగర్ అర్బన్: మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా తయారైంది వినియోగదారుల పరిస్థితి. ఓవైపు కరోనాతో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కాగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తాజాగా వంటగ్యాస్ ధరలను పెంచడం ఆందోళనకర పరిణా మం. రాయితీ గ్యాస్ సిలిండర్లకు రాయితీని కేంద్రం ఖాతాలో జమ చేస్తున్నప్పటికీ నగదు మొత్తం చెల్లించాల్సి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రస్తుత పెంపుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయా వ ర్గాలపై నెలకు రూ.2.50 కోట్ల భారం పడనుంది.

గత ఆగస్టులో రూ.666..
ఇప్పుడు రూ.1,175

గత మూడేళ్లలో గ్యాస్ సిలిండర్ ధరలను తొమ్మిదిసార్లు పెంచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్యాస్ వినియోగదారులు 5,00,720 మంది ఉన్నారు. సగటున నెలకు 3.50 లక్షల సిలిండర్ల వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. గత ఆగస్టులో సిలిండర్ ధర రూ.666 ఉంది. ఇప్పటివరకు రూ.1,125 చెల్లిస్తుండగా ఇకనుంచి రూ.1,175 చెల్లించాల్సి ఉంటుంది.

'కమర్షియల్'.. ఒకేసారి రూ.350 పెంపు

కమర్షియల్ సిలిండర్ ధర ఈ నెల 28వ తేదీ వరకు రూ.2,015 ఉండగా ఒకేసారి రూ.350 పెంచడంతో రూ.2,365కు చేరింది. ఎన్నికల సమయం కావడంతో ధరలను తగ్గించి, వినియోగదారులను తమవైపు తిప్పుకుంటారని భావిస్తే అలా జరగలేదు. ఫలితంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వివిధ రకాల ఆహార ఉత్పత్తులకు ధరలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కమర్షియల్ సిలిండర్లు 80 వేలుండగా పెరిగిన ధరతో నెలకు రూ.2.80 కోట్లు భారం పడనుంది.

ఆగని వసూళ్లు.. రాయితీపై స్పష్టతేదీ?

ఓవైపు గ్యాస్ ధరలు పెరుగుతుంటే డోర్ డెలివరీ బాయ్స్ వసూళ్లు మాత్రం ఆగడం లేదు. అక్రమ వసూళ్లపై అధికారులకు సమాచారమిచ్చినా చర్యలు శూన్యమని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పట్టణాల్లో సిలిండర్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉమ్మడి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు 96 ఉన్నారు. 5 కిలోమీటర్లలోపు దూరం ఉంటే వినియోగదారులకు ఉచితంగా సిలిండర్ ఇంటికి చేరవేయాలి. ఆపై దూరం ఉంటే రూ.10 మాత్రమే తీసుకోవాలి. వినియోగదారుడి ఇంటికి గ్యాస్ సిలిండర్‌ను చేర్చడం ఏజెన్సీ నిర్వాహకుడి బాధ్యత. ఒకవేళ వినియోగదారులు ఏజెన్సీకి వెళ్లి, గ్యాస్ తెచ్చుకుంటే రూ.16.47 తక్కువగా తీసుకోవాలి. కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. అయితే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తొలుత సిలిండర్‌కు రూ.220 చొప్పున రాయితీ ఇచ్చింది. ప్రస్తుతం రూ.47 మాత్రమే జమ చేస్తోంది. ఇప్పుడు ధర పెరిగినా రాయితీపై స్పష్టత ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు	
కరీంనగర్:	1,32,210
జగిత్యాల:	1,28,312
పెద్దపల్లి:	1,31,098
సిరిసిల్ల:	1,09,100

కట్టెల పొయ్యే ఉత్తమం..



గ్యాస్ ధరలను తగ్గించాల్సింది పోయి ఏటికేడు పెంచుతున్నారు. ఒకప్పుడు రూ.514 ఉంటే ఇప్పుడు రూ.1,175కు పెంచారు. ఆ స్థాయిలో ప్రజల ఆదాయం పెరగడం లేదు. ఇలాగైతే మళ్లీ కట్టెల పొయ్యిని ఆశ్రయించడమే ఉత్తమం.

– శిరీష, గృహిణి, కట్టరాంపూర్

వ్యాపారం దెబ్బతింటుంది..



నేను టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న. మా రంగంలో పోటీ ఎక్కువ. గ్యాస్ ధరను ఏకంగా రూ.350 పెంచారు. దీనివల్ల ఇప్పుడున్న రేటుకు టిఫిన్లు చేస్తే గిట్టుబాటు కాదు. టిఫిన్ ధర పెంచితే కస్టమర్లు రాక వ్యాపారం దెబ్బతింటుంది.

– అనిల్, వ్యాపారి

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి పోటీలు
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని(రామగుండం): మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సమాజంలో మహిళలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఈ నెల 5న ఆటలపోటీలు, 6న కోలాటం, నృత్య, అంత్యాక్షరి, పాటల పోటీలు, 8న నియోజకవర్గంలో పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు 'మహిళా రత్న' పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 4వ తేదీలోపు 95283 66666, 98491 09100 నంబర్లకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా ప్రతిభోత్సవం–2023కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, మూల విజయారెడ్డి, కార్పొరేటర్ జనగామ కవితసరోజిని, కో–ఆప్షన్ మెంబర్ తస్నీంబాను, అమరేందర్, సంధ్యారెడ్డి, అనుముల కళావతి, శకుంతల, లలితాశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్

రేపు గ్యాస్ ధరల పెంపుపై మహాధర్నా

కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ఈ నెల 3న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే చందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచి, నిరుపేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపారని ఆరోపించారు.

'మారుపేర్లను మార్చుకునేందుకు అవకాశమిస్తాం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల మారుపేర్లను మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో జరిగిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ ముగింపు బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు అంతం పలికి, బంగారు తెలంగాణ సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. బీజేపీని గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం, రైతులకు ఫసల్ బీమా యోజన, సామాన్య ప్రజలకు ఉపయోగపడే అనేక ప్రభుత్వ పథకాలను తీసుకువస్తామని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులందరికీ సొంతింటి నిర్మాణం కోసం రూ.15 లక్షల వరకు వడ్డీలేని రుణం, కారుణ్య నియామకాల్లో అవినీతి లేకుండా చూస్తామని తెలిపారు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేకు తనను విమర్శించే అర్హత లేదన్నారు. నాయకులు బల్మూరి వనిత, కాజీపేట శివాజీ, వడ్డేపల్లి రామచంద్ర, సోమారపు లావణ్య, గాండ్ల ధర్మపురి, మాతంగి రేణుక, మారం వెంకటేశ్, దుబాసి లలిత, మందల కిషన్‌రెడ్డి, గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. ఆరోగ్యం రెండూ ముఖ్యమే



వేడుకల్లో విద్యార్థులతో నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): విజ్ఞానం.. ఆరోగ్యం రెండూ ముఖ్యమేనని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్లో ఫ్లవర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులచే ఆరోగ్యాన్నిచ్చే వివిధ రకాలైన ఆహార పదార్థాల ప్రదర్శించినట్లు తెలిపారు. మాక్ పోలీస్‌స్టేషన్, మాక్ కోర్టు, రక్త నమూనాల సేకరణ, ల్యాబోరేటరీ, మానవ దేహంలోని వివిధ అవయవాలు, అవి పనిచేసే తీరు, మన పండుగలు, మన గ్రామీణ క్రీడలు తదితర ఎన్నో అంశాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, విషయ అవగాహన, మానసిక ఆనందం పెంపొంది, వారికి ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెస్టోబాల్ పోటీలకు రెఫరీగా ఎంపిక



సత్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహారాష్ట్ర యూత్ మాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సెస్టోబాల్ పోటీలకు రెఫరీగా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పీఈటీ సత్యనారాయణ ఎంపికయ్యారు. ఇండియా–బంగ్లాదేశ్ మధ్య జరగనున్న పోటీల్లో ఆయన రెఫరీగా వ్యవహరించనున్నట్లు సెస్టోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి అకీబ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ ఎంపిక పట్ల తెలంగాణ రాష్ట్ర సెస్టోబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల దామోదర్‌రావు, ఓదెలుయాదవ్, శ్రీనివాస్, ముఖేశ్ కుమార్, కృష్ణారెడ్డి, జమీల్, కృష్ణకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కొండపాక శివారులో వ్యక్తి దుర్మరణం

- మృతుడు రామగుండంవాసి
- బైక్ చెట్టును ఢీకొట్టడంతో ఘటన

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ వివరాల ప్రకారం.. రామగుండం మండల కేంద్రానికి చెందిన కార్లోసన్ సికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో ఉంటున్న బావ పులి కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. బుధవారం స్వగ్రామానికి తండ్రి డేని విన్సెంట్, బావ కిరణకుమార్‌తో రెండు బైక్‌లపై బయలుదేరారు. ఒక బైక్‌పై తండ్రి, బావ, మరో బైక్‌పై కార్లోసన్ వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక గ్రామ శివారులో కార్లోసన్ బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి, బావ రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో బొగ్గు ఉత్పత్తి చేయాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. బుధవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పని స్థలాల్లో ఇబ్బందుల మూలంగా గత నెలలో అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించలేకపోయామని అన్నారు. మొత్తం 7.37 లక్షల టన్నులకు గాను 6.99 లక్షల టన్నులు సాధించి, నిర్దేశిత లక్ష్యాల సాధనలో 95 శాతంతో నిలిచామని పేర్కొన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 77.45 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 78.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో 101 శాతంలో నిలిచామన్నారు. ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి 7,08,262 టన్నుల బొగ్గు రవాణా చేశామని చెప్పారు. రాబోయే నెల రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న క్రమంలో హార్ట్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిత్యం వ్యాయామం, నడకతోపాటు యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 98, ఏపీఏలో 81 శాతం సాధించాం



మాట్లాడుతున్న జీఎంలు వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): సింగరేణి ఆర్జీ–3 ఏరియాలో 98, ఏపీఏ ఏరియాలో 81 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ03, ఏపీఏ జీఎంలు తన్నీరు వెంకటేశ్వర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి నెలలో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు వెల్లడించారు. ఆర్జీ–3 ఏరియాలో 5.90 లక్షల టన్నులకు గాను 5.76 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 98 శాతం సాధించిచామన్నారు. ఓసీపీ–1లో 3.10 లక్షల టన్నులకు గాను 3.29 లక్షల టన్నులతో 106 శాతం, ఓసీపీ–2లో 2.80 లక్షల టన్నులకు గాను 2.47 లక్షల టన్నులతో 88 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 1.77 లక్షల టన్నులకు గాను 1.44 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 81 శాతం సాధించినట్లు తెలిపారు. గతేడాదితో పోల్చితే ఏఎల్పీలో బొగ్గు ఉత్పత్తి మెరుగుపడిందని చెప్పారు. ఓసీపీ–1 సీహెచ్‌పీ నుంచి 6.97 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో కలిసికట్టుగా పనిచేసి, యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఓసీపీ–2లో నీరు, ఏపీఏలో యంత్రాల మొరాయింపు కారణంగా ఉత్పత్తికి ఆటంకం కలిగినట్లు తెలిపారు. ఓసీపీ–2లో ఓబీ మట్టి వెలికితీత కోసం సీ5 ఇన్‌ఫ్రా కంపనీ టెండర్‌ను దక్కించుకుందని, త్వరలోనే పనులు ప్రారంభించాలని నిర్వాహికులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఏరియా ఇంజినీర్ ఎలీషా, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, డీజీఎంలు కె.చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, ఎస్‌ఈ పద్మరాజు, డీవైపీఎం మారుతి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎస్‌వోటూ జీఎం రఘుపతి

రామగిరి(మంథని): సింగరేణి ఆర్జీ–3 ప్రభావిత గ్రామం రామగిరి మండలంలోని పన్నూరులో సింగరేణి నిధులతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి బుధవారం భూమిపూజ చేశారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1లో నిర్ణీత అనుమతి కంటే ఎక్కువగా బొగ్గు వెలికితీసినందుకు ఇటీవల పబ్లిక్ హియరింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పన్నూరు పంచాయతీ పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ మంజూరు చేయాలని సర్పంచ్ అల్లం పద్మ కోరారన్నారు. స్పందించిన యాజమాన్యం పన్నూర్ మూడో వార్డులో, ఎక్స్‌రోడ్డు వద్ద రెండు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మ్యాదరవేని శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు చిందం మహేశ్, ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ యాదవ్, సివిల్ ఎస్‌ఈ పద్మరాజు, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ప్రసాద్, తన్నీరు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఐఏఎస్ ట్రైనీ అధికారుల పర్యటన



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీధర్

- ఐదు బృందాలు.. 25 మంది అధికారులు
- ఈ నెల 4వ తేదీ నుంచి 10 వరకు..
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్

రామగిరి(మంథని): జిల్లాలో ఈనెల నాలుగో తేదీ నుంచి పదో తేదీ వరకు ఐఏఎస్ ట్రైనీ అధికారులు పర్యటిస్తారని డీఆర్డీవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని రత్నాపూర్ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. యూపీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన ట్రైనీ అధికారులు విలేజ్ స్టడీ టూర్ కింద జిల్లాను సందర్శిస్తారని తెలిపారు. మొత్తం ఐదు బృందాలు వస్తున్నాయని, ఒక్కో బృందంలో ఐదుగురు చొప్పున 25 మంది పర్యటిస్తారని వివరించారు. మండలంలోని రత్నాపూర్, జూలపల్లి మండలం కుమ్మరికుంట, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం నాగారం, ధర్మారం మండలం పత్తిపాక, అంతర్గాం మండలం ఆకనపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారంపాటు ఈ గ్రామాల్లో అధికారుల బృందం ప్రజల జీవన విధానం, ఆర్థిక విధానం, గణంక వివరాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర స్థితిగతులపై తెలుసుకుంటారని వెల్లడించారు.

ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన కారు

- డోర్లు తీసుకొని, బయటపడిన యువకులు
- మద్యం మత్తులో కారు నడపడమే కారణం?
- పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో ఘటన



కాలువలో పడిన కారు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఎస్సారెస్పీ ఆర్‌ఎస్‌డీ–4 కాలువలోకి బుధవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి, దూసుకెళ్లింది. మద్యం మత్తులో కారు నడపడం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసింది. అయితే ఎస్సారెస్పీ కాలువలో బుధవారం నుంచే నీరు వస్తుండటం, కారు అందులో పడిపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జనం అధిక సంఖ్యలో గుమిగూడారు. చిన్న కాలువ కావడంతో కారులో ఉన్న ముగ్గురు యువకులు డోర్లు తీసుకొని, పైకి రావడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు యువకుల వివరాలపై ఆరా తీశారు. తాండూరు మండలంలోని కిష్టంపేటకు చెందిన సార్ల అనిల్‌కుమార్, పెద్దపల్లికి చెందిన రేవెల్లి సుమన్, మరో యువకుడు ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపారు.